క్లుప్తంగా

పాలకవర్గాలను నియమించండి



ఎమ్మెల్యే కసిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని హనుమాన్ దేవాలయం, శివాలయాలకు పాలకవర్గాలను నియమించి, అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని పలువురు కాంగ్రెస్ నాయకులు కోరారు. నగరంలోని ఆయన నివాసంలో ఆదివారం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, నాయకులు వెంకట్‌రెడ్డి, మెకానిక్ బాబా, రవీందర్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు.

బీసీలు ఐక్యతగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

మంచాల: బీసీలంతా ఐక్యతగా ఉండాలని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గడ్డం నర్సింహ గౌడ్ అన్నారు. ఆదివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు ఐక్యతగా లేక పోవడం వలనే రాజ్యాధికారానికి దూరమవుతున్నామని తెలిపారు. ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి, రాజ్యాధికార దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జనాభా ప్రకారం అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారోజు రాజు, మండల నాయకులు ఓరిగంటి శ్రీనివాస్, ఆశయ్య, బాలరాజ్, యాదయ్య, సురేష్, మహేందర్, జంగయ్య, యాదయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇబ్రహీంపట్నం రూరల్: కప్పపహాడ్ గ్రామానికి చెందిన జంగిలి జంగయ్య(70) ఇటీవల గుండె పోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆదిబట్ల మున్సిపాలిటీ మాజీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ప్రజలకు మందులు పంపిణీ చేస్తున్న విక్రంరెడ్డి

ఆమనగల్లు: హైదరాబాద్ నీలాద్రి హాస్పిటల్ సౌజన్యంతో కల్లు విక్రంరెడ్డి ఆధ్వర్యంలో ఆమనగల్లు మండలం మాలెపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత ఆరోగ్య వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. వైద్య బృందం సుమారు 250 మందికి వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, డాక్టర్లు సిద్దార్థ్, సైదులు, ఇందు, సిబ్బంది సురేశ్, ప్రశాంత్, నాయకులు రాంరెడ్డి, జితేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి తదితరులు

ఆమనగల్లు: హెలెన్ కెల్లర్ వారోత్సవాల సందర్భంగా మంగళవారం నుంచి 7వ తేదీ వరకు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామని క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అంధులు, బధిరులు, మూగవారికి వారధిగా ప్రపంచస్థాయిలో గుర్తింపు పొంది, ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన హెలన్ పేరిట క్లబ్ జిల్లా గవర్నర్ డా.మహేంద్రకుమార్ సూచన మేరకు.. కార్యక్రమాలు చేపట్టనున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం, కంటి ఐఓఎల్ ఆపరేషన్లు, మధుమేహ నిర్ధారణ, రక్తదాన శిబిరం, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ, వైద్యులకు సన్మాన చేయనున్నామని వివరించారు. సమావేశంలో క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్, కోశాధికారి శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌ఓ పాషా తదితరులు ఉన్నారు.

సమీకృత మార్కెట్ కలేనా?

- బీఆర్‌ఎస్ హయాంలో రూ.4.50 కోట్లతో శ్రీకారం
- అసంపూర్తిగా నిర్మాణ పనులు
- రోడ్లపైనే చేపల విక్రయాలు.. ట్రాఫిక్ ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఆమనగల్లులో రోడ్డు పక్కన చేపల విక్రయం



అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ మార్కెట్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం కలగానే మిగిలిపోనుందా? క్రయవిక్రయదారుల ఇక్కట్లు తీరడానికి పరిష్కారమే లేదా అంటే.. అసంపూర్తిగా నిలిచిన నిర్మాణ పనులను చూస్తుంటే నిజమేనని అనిపిస్తోంది. బీఆర్‌ఎస్ హయాంలో స్థానికంగా చేపలు, మాంసం, కూరగాయల విక్రయాల కోసం వ్యవసాయ మార్కెట్‌యార్డులోని ఎకరా స్థలంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా రూ.4.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. 2021 నవంబర్ 8న నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసింది. అయితే నిధుల లేమితో సంబంధిత నిర్మాణ దారుడు పనులను మధ్యలోనే ఆపేసినట్లు సమాచారం.

రోడ్డుకు ఇరువైపులా..

సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో చేపల వ్యాపారులకు అనువైన స్థలం లేకపోవడంతో పోలీసు స్టేషన్ వెనుకభాగం మాడ్గుల మార్గంలో రోడ్డుకు ఇరువైపులా విక్రయిస్తున్నారు. సౌకర్యాల లేమితో కొనుగోలు దారులతో పాటు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా.. సరైన షెడ్లు, వసతులు లేని కారణంగా చేపలను నిల్వ చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నామని వ్యాపారులు పేర్కొంటున్నారు. వ్యర్థాలను పారబోసేందుకు ఇక్కట్లు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. కాగా.. చేపల విక్రయాలతో మున్సిపాలిటీకి ఆదాయం సమకూరుతున్నప్పటికీ.. తగిన సౌకర్యాలు కల్పించడం లేదు. ఫలితంగా వ్యాపారులు, కొనుగోలుదారులు, స్థానికులు ఇలా అందరూ ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డి దృష్టికి..

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పూర్తి చేయాలని వ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు. రెండేళ్లుగా నిర్మాణ పనులు నిలిచిపోయాయని, అవసరమైన నిధులను కేటాయించి పనులు పూర్తి చేయాలని మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు.. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి విన్నవించారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే.. సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్య తీర్చాలని ఆదేశించినట్లు సమాచారం.

తాగునీటికి 'ఐక్యత' సాయం



వాటర్‌ప్లాంటును ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఐక్యత ఫౌండేషన్ కృషి చేస్తోందని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి ఎర్రబిక్యతండాలో రూ.1.50 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజా సంక్షేమ కోసం ఫౌండేషన్ పనిచేస్తుందని చెప్పారు. సురక్షిత తాగునీరు అందించేందుకు వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం సుంకిరెడ్డిని గిరిజనులు ఘనంగా సన్మానించారు. అంతకుముందు హనుమాన్ దేవాలయం పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, నాయకులు బొబ్బిలి, రాజశేఖర్, కృష్ణ, బిచ్యానాయక్, మోత్యానాయక్, సక్రు, హనుమంతు, నంగ్రియ, గాంగ్యా, హర్యా, రాములు, శ్రీను, రమేశ్, బాస్కర్, వినోద్, సికిందర్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

కడ్తాల్: దేవాలయాల నిర్మాణంతో భక్తి భావం పెంపొందుతుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం కానుగుబావితండాలో నిర్మిస్తున్న తుల్జాభవానీ ఆలయానికి ఆదివారం ఆయన రూ.లక్ష విరాళం అందజేశారు. దేవాలయాల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం ఆలయ నిర్వాహకులు సుంకిరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మాజీ ఉప సర్పంచ్ పాండునాయక్, నాయకులు బీచ్యానాయక్, నర్సింగ్ నాయక్, దేవులానాయక్, ఫౌండేషన్ సభ్యులు రఘు తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ సేవలు మరువలేనివి



సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: తెలంగాణ మలిదశ పోరాటంలో ఉద్యమకారుడు, గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ సాయిచంద్ మౌర్య కీలక పాత్ర పోషించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ అన్నారు. సాయి వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహా రెడ్డిలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సాయిచంద్ తన ఆట పాటలతో ఉద్యమాన్ని ఉధ్రుతలూగించారని తెలిపారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కందపెద్ద నర్సింహ, నాయకులు జోగు వీరయ్య, తులసీరాం, లచ్చిరామ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

నూతన రేషన్ కార్డుల పంపిణీ



రేషన్ కార్డు అందజేస్తున్న యువజన నాయకులు

కడ్తాల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్, మండల అధ్యక్షుడు బోసురవి అన్నారు. అర్హులకు మంజూరైన కొత్త రేషన్ కార్డులను ఆదివారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో నూతనంగా ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, నిరుపేదలకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే అర్హులందరికీ కార్డులు అందజేస్తోందని తెలిపారు. రానివారు ఉంటే మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూత్ నాయకులు ఇమ్రాన్‌బాబా, ఆకాశ్‌గౌడ్, భానుకిరణ్, కృష్ణ, శ్రీను, రామకృష్ణ, సందీప్ తదితరులు ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

యాచారం: రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, రైతుల భూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 24 గ్రామాల్లో ఏడాది క్రితం రెండు వేలకు పైగా భూ సమస్యలున్నాయని, నేటికీ అవి అలాగే ఉన్నాయని పేర్కొన్నారు. భూ సమస్యలపై ప్రజలు ఫిర్యాదులు చేస్తున్నారే కానీ.. అవి పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. అధికారులు చిత్తశుద్ధితో ప్రస్తుత సదస్సుల్లో అందిన అర్జీలకు పరిష్కారం మార్గం చూపాలని కోరారు. లేని పక్షంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

మైసమ్మ సన్నిధిలో మాజీ ఎంపీ



అమ్మవారిని దర్శించుకున్న మధుయాష్కీగౌడ్

కడ్తాల్: మండల పరిధి మైసిగండి మైసమ్మ అమ్మవారిని ఆదివారం కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మధుయాష్కిని పూలమాల శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ స్నేహలత, ట్రస్టీ శిరోలి, నాయకులు దుర్గారెడ్డి, అర్చక సిబ్బంది చంద్రయ్య, కృష్ణయ్య, యాదగిరి, బాలబ్రహ్మచారి తదితరులు ఉన్నారు.

ఆలయ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చెరువు కట్ట కింద వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా శెట్టి శివకుమార్, అధ్యక్షులుగా మయిని ఆనందప్ప, ప్రధాన కార్యదర్శిగా పట్నంశెట్టి విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా అప్పగిరి తిరుమల్, ముత్యాల అనిల్, రమేష్, కోశాధికారిగా పవన్, కార్యక్రమ నిర్వాహక కార్యదర్శిగా మహేందర్, కార్యదర్శులుగా బౌరిశెట్టి భద్రప్ప, కర్రె గిరిధర్, బీక్లో రవి, మయిని చంద్రకాంత్, ఆకుల సంతోష్, ముఖ్య సలహాదారులుగా శివకుమార్, ప్రభు, మఠం చండీశ్వర్, సలహాదారులుగా మహేశ్, సిద్దప్ప, బాలరాజ్, నగేశ్, యాదప్ప, కార్యక్రమ సంయుక్త కార్యదర్శులుగా ఫణికుమార్, వినోద్, కిషోర్, అమర్నాథ్, శంకర్, భాను, వీరేశ్, రమేష్, కమిటీ సభ్యులుగా శ్రీకాంత్, విజయ్, శ్యామ్‌లాల్, రమేష్, విక్రమ్, సంపత్, రాజ్‌కుమార్‌లను నియమించారు.

ఆలయాభివృద్ధికి కృషి

వీరభద్రస్వామి ఆలయాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని కమిటీ చైర్మన్ శెట్టి శివకుమార్ అన్నారు. ఎండోమెంట్ పరిధిలో ఈ దేవాలయం ఉందని, అయినా ఎలాంటి ఆదరణకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. గుడిని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో పుష్కర కాలంగా దృష్టి సారించానని తెలిపారు. భక్తుల సహకారంతో దేవాలయం క్రమంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

చినుకు రాలదు.. చింత తీరదు

- ముఖం చాటేసిన వరుణుడు
- మొలకదశలో ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు

షాబాద్: రోహిని కార్తెలో కురిసిన తొలకరికి మండలంలోని తిమ్మారెడ్డిగూడ, తాళ్లపల్లి, తిర్మలాపూర్ తదితర గ్రామాలకల రైతులు పత్తి విత్తనాలు వేశారు. నల్లరేగడి భూములు కావడంతో మొలకెత్తాయి. కానీ వరుణుడు ముఖం చాటేయడంతో అవి ఎండిపోతున్నాయి. ఇప్పటికే భారీగా పెట్టుబడి పెట్టామని, ఇంకా వర్షాలు పడకపోతే అప్పుల పాలవుతామని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోటి ఆశలతో వానాకాలం సీజన్ సాగును ప్రారంభించిన వారికి.. చినుకు రాలకపోవడంతో నిరాశే ఎదురైంది. ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉండగా.. పలు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన చిరు జల్లులకు కర్షకులు పలు రకాల విత్తనాలు విత్తుకున్నారు. నాటి నుంచి ఒక్క వాన పడకపోవడంతో అవి మొలకెత్తలేదు. అక్కడక్కడా మొలకెత్తినవి కూడా ఎండిపోతున్నాయి. దీంతో రైతులు వాటిని కాపాడుకునేందుకు రైతులు భగీరథ యత్నం చేస్తున్నారు.

కప్పతల్లి ఆటలు

చేవెళ్ల: వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని వేడుకుంటూ గ్రామస్తులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు, కప్పతల్లి ఆటలు నిర్వహించారు. మండలంలోని కౌకుంట్ల గ్రామంలో ఆదివారం మహిళలు గ్రామ దేవతలకు పూజలు చేసి, కప్పకావడి ఆటలు ఆడారు. కప్పను రోకలికి కట్టి పసుపు, కుంకుమలతో అలంకరించి ఇంటింటికీ తిరుగుతూ వర్షాలు కురవాలి.. వాన దేవుడా కరుణించూ అంటూ పాటలు పాడుకుంటూ పూజలు చేశారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

బడంగ్‌పేట్: మహిళలు, గ్రూపు సంఘాల సభ్యులు స్వశక్తితో ఎదగాలని మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి సూచించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మెప్మా గ్రూపు సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. 502 సంఘాల లక్ష్యం ఉన్నప్పటికీ ఇప్పటి వరకు 193 సంఘాలకు బ్యాంక్ లింకేజీ ఏర్పాటు చేశామన్నారు. లింకేజీ ద్వారా ఏర్పడిన సంఘాలను గుర్తించి రుణాలను అందిస్తున్నామని స్పష్టం చేశారు. బ్యాంక్ లింకేజీ ద్వారా వీధి వ్యాపారాలను ప్రోత్సహించేందుకు శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేశామన్నారు. సంఘాల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు ఆలవాలం

- కనీస సౌకర్యాలు కరువు
- డ్రైనేజీ, రోడ్లకు నోచుకోని కాలనీ



మామిడిపల్లి వేంకటేశ్వర కాలనీ

పహాడీషరీఫ్: మౌలిక సదుపాయాలు కల్పించాలని శ్రీ వేంకటేశ్వర కాలనీ ప్రజలు కోరుతున్నారు. డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, పార్కు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. బడంగ్‌పేట మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధి మామిడిపల్లి వేంకటేశ్వర కాలనీలో హెచ్‌ఎండీఏ అనుమతులు లేకుండా గతంలో ఓ వెంచర్ ఏర్పాటు చేశారు. ఈ వెంచర్ విమానాశ్రయం పక్కనే ఉండటంతో ఇక్కడ చాలామంది ప్లాట్లను కొనుగోలు చేశారు. నివాసాలు వెలుస్తున్నాయి. కానీ కనీస సదుపాయాలు లేని కారణంగా చాలామంది ఇళ్లు కట్టుకునేందుకు సాహసించడం లేదు. నివాసం ఏర్పర్చుకున్న వారు.. నివసించేందుకు అష్టకష్టాలు పడుతున్నారు.

ఇళ్ల మధ్యే మురుగు

రియల్ వ్యాపారులు కొందరు.. మామిడిపల్లిలో పొలాలను కొనుగోలు చేశారు. రాళ్లు పాతి విక్రయించి చేతులు దులుపుకొన్నారు. డ్రైనేజీ పైప్ లైన్లు, అవుట్‌లెట్ లేని కారణంగా.. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న మురుగునీరు ఈ ప్లాట్ల నడుమ పారుతోంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దోమలు వృద్ధి చెంది కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించినా..

అనధికారిక లేఅవుట్‌గా ఉన్న ఈ వెంచర్‌లో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు.. రెండు నెలల క్రితం చాలా మంది ఎల్‌ఆర్‌ఎస్ రుసుం చెల్లించారు. ఒక్కొక్కరు లక్ష వరకు చెల్లించినా.. మున్సిపల్ అధికారులు తమ కాలనీలో సదుపాయాలు కల్పించడం లేదని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతున్నారు.

నిధులు లేక.. నీరసించి

- అసంపూర్తిగా డ్వాక్రా భవన నిర్మాణం
- బీఆర్‌ఎస్ హయాంలో రూ.10 లక్షలతో శ్రీకారం
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- పొదుపు సంఘాల సమీక్షలకు కరువైన వేదిక



ఇబ్రహీంపట్నంలో అసంపూర్తిగా డ్వాక్రా భవనం

ఇబ్రహీంపట్నం: నిధులు లేక డ్వాక్రా భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాల (మెప్మా) మహిళా సమావేశాల కోసం ఇబ్రహీంపట్నం పాత పోలీస్ స్టేషన్‌లోని ఖాళీ స్థలంలో రూ.10 లక్షలతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. నాటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పనులు కొనసాగినప్పటికీ.. నిధుల లేమితో స్లాబ్, గోడల నిర్మాణంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం రాష్ట్రంలో మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మిగిలాయి.

60 పొదుపు సంఘాలు

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధి మూడు, నాలుగు వార్డుల్లోని అంబేడ్కర్ నగర్, వెంకటరమణ కాలనీ, బాబుజగ్జీవన్‌రాం కాలనీ, ఆదర్శనగర్ కాలనీల్లో 60 పొదుపు సంఘాలు ఉన్నాయి. అందులో 650 మందికి పైగా సభ్యులున్నారు. వీరంతా ఒకేచోట కూర్చొని పొదుపు సంఘాల సమావేశాలు నిర్వహించుకునేందుకు సరైన వేదిక కరువైంది. దీంతో ఆయా గ్రూపు లీడర్ల ఇళ్లు, దేవాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితర చోట్ల నెలవారి సమావేశాలు నిర్వహించుకుంటూ నెట్టుకొస్తున్న నేపథ్యంలో.. సంఘాల కష్టాలు తీర్చేందుకు గత ప్రభుత్వం డ్వాక్రా భవన నిర్మాణ పనులు చేపట్టింది. కానీ నిధులు రాకపోవడంతో రెండున్నర ఏళ్లుగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో మహిళా సంఘాల సమస్య మొదటికి వచ్చింది. పొదుపు, అప్పులు, చెల్లింపులు, సభ్యుల ఉపాధి, వ్యాపారాలకు సంబంధించిన అంశాలపై చర్చించుకునేందుకు పొదుపు లీడర్లు.. అడ్డాకోసం అన్వేషించడం నిత్యకృత్యంగా మారింది.

నిర్మాణం పూర్తిచేయాలి



మూడు, నాలుగు వార్డుల పరిధిలో డ్వాక్రా భవనాన్ని నిర్మించాలని నాటి ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి విన్నవించాం. పాత ఠాణా ఖాళీ స్థలంలో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ పనులు మధ్యలోనే ఆగిపోయాయి. రెండేళ్లుగా పనులు ముందుకు సాగడం లేదు. దీంతో డ్వాక్రా మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందిగా మారింది. వెంటనే నిర్మాణం పూర్తి, భవనాన్ని వినియోగంలోకి తేవాలి.

– భర్తకి హంసమ్మ, మెప్మా ఆర్పీ, ఇబ్రహీంపట్నం

నిధులు రాగానే పనులు



కొత్తగా బాధ్యతలు చేపట్టాను. అర్ధాంతరంగా నిలిచిన పనుల గురించి సమీక్ష నిర్వహించాను. డ్వాక్రా భవన నిర్మాణం తన దృష్టికి వచ్చింది. నిధులు(గ్రాంట్స్) రాగానే నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. వినియోగంలోకి తెస్తాం. మహిళా సంఘాల సమస్య తీరుస్తాం.

– సత్యనారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం